క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సత్కారం



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని 13వ వార్డులో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను జొన్నవాడ దేవస్థాన చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ దంపతులు శనివారం సత్కరించారు. అనంతరం వారికి వస్త్రాలను అందజేశారు. ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాలలో 1998 – 99 మధ్య పదో తరగతి చదివిన వారు కలుసుకొని నాటి స్మృతులను నెమరేసుకున్నారు. అప్పటి విద్యార్థి.. ప్రస్తుత డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గురవయ్యను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు కొండయ్య, వెంకటేశ్వర్లు, మాణిక్యమ్మ, జయబాల, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): అనారోగ్యంతో బాధపడుతున్న రవి కుటుంబానికి ఊటుకూరు ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. ఈ సందర్భంగా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నేత దయాకర్ మాట్లాడారు. మండలంలోని యలగాలమ్మగుంట కాలనీకి చెందిన రవి కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, విషయాన్ని తెలుసుకున్న ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కలిసి నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు రూ.నాలుగు వేలను అందజేశారని చెప్పారు. నాగార్జున్‌రెడ్డి, వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని రేబాలలో క్రికెట్ పోటీలను ఆర్పీఎం యూత్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ శ్రీనివాసులు మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా పోటీలను నిర్వహించడాన్ని అభినందించారు. మురళీకృష్ణ, పవన్‌కుమార్‌రెడ్డి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. నెల్లూరుకు చెందిన మురళీకృష్ణ పని నిమిత్తం బైక్‌పై గూడూరు బయల్దేరారు. ఈ క్రమంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. గాయపడిన మురళీకృష్ణను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్చకులకు సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అర్చకులకు సన్మాన కార్యక్రమాన్ని వెంకటేశ్వరపురంలోని సాయి యోగధ్యాన మందిరంలో శనివారం నిర్వహించారు. రాఘవాచార్యులు, సత్యనారాయణాచార్యులు, రమేష్, వెంకటరమణను దివ్యాంగుల ఐక్య సంఘం, బ్లాక్‌బోర్డు మిత్రమండలి, జ్ఞానేంద్ర సరస్వతి అంధుల సేవా సంస్థల ఆధ్వర్యంలో సత్కరించారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రసాద్, రవికుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నెల్లూరు(వేదాయపాలెం): నూర్‌బాషా సంఘ క్యాలెండర్లను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు శనివారం ఆవిష్కరించారు. అల్లూరు మండలం ఇస్కపల్లిలో మస్తాన్‌రావును నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూర్‌బాషాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నేతలు సలీమ్, ఖాదర్‌బాషా, బాబర్‌జాన్, హుస్సేన్‌బాషా, మస్తాన్, షరీఫ్, మస్తాన్ సాహెబ్, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో భోగి

భోగి పండగను కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పోటీ పడి మంటలను వేశారు. పతంగులను ఎగురవేయడంతో పాటు క్రికెట్, కబడ్డీ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సొంతూళ్లకు రావడంతో సందడి నెలకొంది. – సాక్షి నెట్‌వర్క్



పొదలకూరు: భోగి మంట వేస్తున్న యువకులు



బుచ్చిరెడ్డిపాళెంలో..



తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులో..



మనుబోలులో..



ముత్తుకూరు: వెంకన్నపాళెంలో..



బుచ్చిరెడ్డిపాళెం: విడవలూరులో..



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..

నేత్రపర్వంగా గోదా, రంగనాథస్వామి కల్యాణం



పొదలకూరు: భోగిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. తిరుప్పావై పఠనం, ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపారు. ఉభయ కర్తలుగా దుర్గారావు, ఉత్తర దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు శ్యామ్‌ప్రసాద్‌నాయుడు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, శ్రీనివాసులు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

తోటపల్లిగూడూరు: గ్రామీణ క్రీడలు, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని ఎస్సెస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరి గిరీష్‌రెడ్డి కోరారు. పాపిరెడ్డిపాళెంలో జిల్లా స్థాయి చెడుగుడు పోటీలను ఏఎమ్మార్, ఎస్సెస్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరీష్‌రెడ్డి మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకొని తన స్వగ్రామమైన పాపిరెడ్డిపాళెంలో గ్రామీణ క్రీడలను ఏటా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శంకరయ్యగౌడ్, నేతలు శ్యామ్‌సుందర్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకుడు ఈశ్వరయ్య, స్థానికులు జనార్దన్, రాము, తదితరులు పాల్గొన్నారు.



చెడుగుడు పోటీల్లో తలపడుతున్న జట్లు

హోరాహోరీగా..

జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 35 జట్లు పాల్గొంటున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న పోటీలను తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

వేడుకగా మనుబోలమ్మ గ్రామోత్సవం



మనుబోలు: గ్రామదేవత మనుబోలమ్మ గ్రామోత్సవాన్ని వేడుకగా శుక్రవారం అర్ధరాత్రి నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు ఫణీంద్రశర్మ, సాయిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు. అనంతరం మనుబోలమ్మను వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ.. బాణసంచా పేలుస్తూ కేరింతలు కొట్టారు. ఉభయకర్తలుగా పెంచలయ్య, జ్యోతి దంపతులు వ్యవహరించారు.

స్వగ్రామం తోడేరులో మంత్రి కాకాణి

పొదలకూరు: మండలంలోని తన స్వగ్రామమైన తోడేరుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం చేరుకున్నారు. సంక్రాంతి సందర్భంగా కుటుంబసభ్యులతో సొంతూరికి వచ్చిన మంత్రికి గ్రామంలోని అభిమానులు, యువకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సంక్రాంతి సందర్భంగా పెద్దలకు ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం వరకు ప్రజలకు మంత్రి అందుబాటులో ఉండనున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



పొదలకూరు: పంట కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన మండలంలోని నరసింహకండ్రిక వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చేజర్ల మండలం ఆదూరుపల్లికి చెందిన కొందరు కారులో నెల్లూరు బయల్దేరారు. ఈ క్రమంలో నరసింహకండ్రిక వద్ద బైక్‌ను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. కాగా కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటన స్థలాన్ని ఎస్సై కరిముల్లా పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలకు అండగా సోమిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నేతలు

నెల్లూరు(సెంట్రల్): టీడీపీలో ఉంటూ దొంగతనాలు, అవినీతి.. అక్రమాలకు పాల్పడుతున్న వారిని వెనుకేసుకొస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డే ఒక పెద్ద దొంగ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ముత్తుకూరు మండల టీడీపీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి విద్యుత్ చౌర్యానికి పాల్పడితే అధికారులు పట్టుకున్నారని, ఈ వ్యవహారంలో ఆయన్ను సమర్థించడం సమంజసమా అని ప్రశ్నించారు. మనుబోలు మండలంలో టీడీపీ నేతలు ధాన్యం దొంగతనానికి పాల్పడ్డారని గుర్తుచేశారు. సోమిరెడ్డి, ఆయన కుమారుడు గతంలో అధికారంలో ఉన్న సమయంలో గజదొంగల్లా దోచుకున్నారని ఆరోపించారు. కూలీకి తీసుకొచ్చిన వారికి కండువాలు కప్పిన విషయం బయటపడటంతో రుసరుసలాడుతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో.. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఉందనే విషయాన్ని చంద్రమోహన్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలని సూచించారు. చిన్నపరెడ్డి, శంకరయ్యగౌడ్, సురేంద్రబాబు, నర్సయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం



దర్శించుకుంటున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనాన్ని శనివారం ఏర్పాటు చేశారు. తొలుత ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పడిపూజ చేసి స్వామివారికి నైవేద్యాలను సమర్పించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలకు రంగవల్లుల పోటీలను సాయంత్రం నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ మాలకొండారెడ్డి, రమణయ్య, తదితరులు పర్యవేక్షించారు.

అంబేడ్కర్ నాటిక పోస్టర్ల ఆవిష్కరణ



మనుబోలు: మండలంలోని వీరంపల్లి పంచాయతీ కొండుపాళెంలో మంగళవారం నిర్వహించనున్న అంబేడ్కర్ నాటికను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. నాటికకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించిన అనంతరం నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడారు. అంబేడ్కర్ గురించి సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా నాటికను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా గీతం వర్సిటీ ప్రొఫెసర్ రమేష్‌బాబు హాజరుకానున్నారని చెప్పారు.

డాక్టర్ శ్రీహరికి నివాళి



పొదలకూరు: జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ భర్త, పేదల డాక్టర్‌గా పేరొందిన శ్రీహరి తృతీయ వర్ధంతిని స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్‌గా శ్రీహరి పేదలకు చేసిన సేవలను కొనియాడారు. పొదలకూరు ప్రాంతంలో మూడు దశాబ్దాలకుపైగా వైద్యసేవలను అందించి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. వెంకటేశ్వర్లు, సాయి, ఎస్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎడ్ల పందేలు





ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు



తృతీయ స్థానాన్ని సాధించిన జట్టు

సంక్రాంతిని పురస్కరించుకొని కోవూరులో ఎడ్ల పందేలను శనివారం కోలాహలంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 35 జతల ఎడ్లు పోటీలకు హాజరయ్యాయి. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. – కోవూరు







జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లు